డైలీ హెల్త్ డైరీ



హోమియో...

# కర్ణభేరికి రంధ్రం..?

నా ముఖం మీద అంటే ముక్కు పైన, కళ్ల దగ్గర (కనుబొమల మధ్య) నల్ల మచ్చలు ఉన్నాయి. మొదట పుట్టుమచ్చల్లా చిన్నగా ఉండేవి. ఇప్పుడు కొంచెం పెద్దవయ్యాయి. వీటికి హోమియోలో మందులు ఉన్నాయా? ఇవి వాడేటప్పుడు ఆహార నియమాలేమైనా పాటించాలా?

– టి. లక్ష్మి, ఊరిపేరు రాయలేదు

చర్మ వ్యాధులను చూస్తేనే, ఆ వ్యాధిని నిర్ధారించి చికిత్స చేయడం సులభమౌతుంది. ఎటువంటి మచ్చలకైనా హోమియోలో మంచి మందులున్నాయి. అయితే తగ్గడానికి పట్టే సమయం ఆ మచ్చలు ఎంతకాలం నుంచి వస్తున్నాయి. ఎందువల్ల వచ్చాయి అనేదాన్ని బట్టి ఉంటుంది. సాధారణంగా చర్మవ్యాధులను నియంత్రించడానికి మసాలా లను, పులుపు పదార్థాలను తగ్గించడం, ఎక్కువ నీటిని తీసుకోవడం శ్రేయస్కరం. ప్రస్తుతానికి మీరు కెలాండ్యులా ఆయింట్‌మెంట్‌ని నల్లమచ్చలపై మాత్రమే రోజుకు రెండుసార్లు పూయండి. అదేవిధంగా కెలాండ్యులా మదర్ టించర్‌ని రోజు 10 చుక్కలు నీటిలో వేసుకొని రోజుకు ఒకసారి తాగండి. హోమియో వైద్యుని ఆధ్వర్యంలో మందులు వాడడం మంచిది.

నాకు 18ఏళ్లు. దాదాపు మూడేళ్ల నుంచి కడుపులో పురుగులతో బాధపడుతున్నాను. పురుగులు మలద్వారం నుంచి బయటకు వచ్చి యోని వరకూ పాకుతున్నాయి. మందులు వాడుతున్నా తగ్గడం లేదు. తీపి పదార్థాలు తీసుకోవడం మానేశాను. ఎర్రమట్టి ఉన్న నీళ్లు తాగాను. అందువల్లనే ఇలా వస్తున్నాయా? ఈ పురుగులు తగ్గడానికి చికిత్స ఏమిటో, ఏ మందులు వాడాలో తెలియజేయండి.

– ఒక సోదరి, ఊరి పేరు రాయలేదు

కడుపులో పురుగులు పడటం అనేది కేవలం చిన్నపిల్లల్లోనే కాకుండా పెద్దవాళ్లలో కూడా వచ్చే అవకాశం ఉంది. కలుషితమైన ఆహారం, నీరు. అపరిశుభ్రమైన నీరు, అపరిశుభ్రమైన నీటిలో స్నానం చేయడం, పాదరక్షలు లేకుండా తిరగడం వంటి కారణాల వల్ల కడుపులో పురుగులు పడతాయి. చిన్నపిల్లలు మట్టిలో ఆడుకుని చేతులు శుభ్రంగా కడుక్కోకుండా నోటిలో పెట్టుకోవడం వలన కడుపులోకి పురుగులు చేరుతుంటాయి. ఇవి కడుపులోని పెరియానల్ రీజియన్‌లోనూ, పెరినియం (మల ద్వారానికి, యోనికి మధ్య భాగంలోనూ ఉండడం వలన దురద కలుగుతూ ఉంటుంది. వీటిని థ్రెడ్ వార్మ్స్ లేదా సీట్ వార్మ్స్ అంటారు. వీటి నివారణ కోసం హోమియోలో మంచి మందులు ఉన్నాయి.

మీరు 'సినా' మందు 30 పొటెన్సీలో రోజూ పొద్దున ఒక డోసు, క్లిమాటిస్ ఎరెక్టా 30 పొటెన్సీలో రోజూ సాయంత్రం ఒక డోసు వరుసగా 3 రోజులు తీసుకోండి. ఆ తరువాత వారం రోజులు గ్యాప్ ఇచ్చి మళ్లీ ఇదేవిధంగా వాడితే మీకు ఆ బాధ ఉండదు.

## లాకెసిస్

హోమియో వైద్యవిధానంలో వాడే ఎన్నో మందులలో లాకెసిస్ ముఖ్యమైన ఔషధం. దీనిని సురుకుకూ పాము లేదా బుష్ మాస్టర్ అనే పాము విషం నుంచి తయారు చేస్తారు. లాటిన్ భాషలో దీనిని లాకెసిస్ ట్రిగానో సిఫాలస్ అంటారు. డాక్టర్ కాన్‌స్టాంటిన్ హెరింగ్ అనే అమెరికన్ వైద్యుడు ఈ ఔషధాన్ని తయారు చేసి డ్రగ్ ప్రూవింగ్ విధానం ద్వారా ఈ ఔషధం గుణగణాలను తెలుసుకొని ఇది ఎటువంటి వ్యాధులను నయం చేయడానికి వాడవచ్చునో, ఎటువంటి మనస్తత్వాలకు ఈ మందు సరిపోతుందో చక్కగా వివరించారు. కాబట్టి డాక్టర్ హెరింగ్‌ని అమెరికన్ హోమియో వైద్య పితామహుడు అంటారు.

లాకెసిస్ మందు ప్రభావం ముఖ్యంగా రక్తప్రసరణ వ్యవస్థ పైన, నాడీ కణజాలం పైన ఎక్కువగా ఉంటుంది. కావున రక్తప్రసరణ, నాడీకణ వ్యవస్థకు సంబంధించిన వ్యాధుల చికిత్సకు ఈ మందు బాగా ఉపయోగపడుతుంది.



నాకు 40 ఏళ్లు. ఎడమ చెవిలో హోరుగా ఉండి అప్పుడప్పుడు లోపలకు లాగుతున్నట్టుగా నొప్పిగా ఉంటుంది. కర్ణభేరికి రంధ్రం పడింది. కర్ణభేరి తిరిగి ఏర్పడటానికి హోమియోలో మందులున్నాయా? ఉంటే తెలియజేయండి.

– కె.బి.సి, తిమ్మాపురం

చెవిలో హోరు (శబ్దం వినిపించడం)ను టినిటస్ అంటారు. ఈ శబ్దం రకరకాలుగా వినిపిస్తుంటుంది. ఉదాహరణకు గంట కొట్టినట్లుగా కాని, తుమ్మెద ఝుయ్ అంటున్నట్లుగా, గాలి వీస్తున్నట్లు, సముద్రపు అలల శబ్దం వంటివి. మీ విషయంలో టినిటస్ ఉండడానికి గల కారణం కర్ణభేరి ఇన్‌ఫ్లమేషన్ లేదా కర్ణభేరికి రంధ్రం పడటం కారణం కావచ్చు. చెవి ఇన్‌ఫ్లమేషన్ ఉన్నప్పుడు ఎక్కువ అవుతూ ఉంటుంది. దీనికి హోమియోలో చాలా మంచి మందులున్నాయి. హోమియో వైద్యుని ఆధ్వర్యంలో మందులు కొంతకాలం వరకు క్రమం తప్పకుండా వాడినట్లయితే మీ సమస్యను పూర్తిగా నయం చేయవచ్చును. ప్రస్తుతానికి మీరు 'బెల్లడోనా 200' పొటెన్సీలో రోజుకు రెండుసార్లు చొప్పున వాడినట్లయితే నొప్పి, చెవిలో హోరు, చెవి పోటును తాత్కాలికంగా నయం చేయవచ్చు.



డాక్టర్ రాజశేఖర్,
ష్యూర్‌కేర్ హోమియోపతి

నాకు 62ఏళ్లు. స్కానింగ్ చేస్తే గాల్ బ్లాడర్‌లో స్టోన్ ఉన్నట్టు తెలిసింది. ఆపరేషన్ చేసి స్టోన్ తీసేయాలని డాక్టర్ అన్నారు. ఆపరేషన్ తప్పనిసరా? హోమియో మందుల ద్వారా ఆ స్టోన్‌ను కరిగించే అవకాశం ఉందా? తెలియజేయండి.

– ఎ.రాజా, మెట్‌పల్లి

గాల్‌బ్లాడర్‌లో రాళ్లు ఏర్పడటం వలన కడుపులో నొప్పితో పాటు ఆహారంలోని కొవ్వు పదార్థాల జీర్ణక్రియ సరిగ్గా జరగదు. గాల్‌బ్లాడర్‌లో ఉండే రాళ్లకోసం హోమియోలో మంచి మందులున్నాయి. అయితే రాళ్ల పరిమాణం చిన్నగా ఉన్నట్లయితే తప్పకుండా కరిగిపోతాయి. కానిరాళ్ల పరిమాణం 8మి.మీ కు మించి ఉన్నట్లయితే కరగడం కష్టమవుతుంది. మీరు రోజుకు రెండుసార్లు ఉదయం సాయంత్రం కొలిస్టరినమ్ మందును 3 పొటెన్సీలో 2 టాబ్లెట్స్ చొప్పున వాడుతూ ఉండండి. దీనికి తోడు బెరిబెరిస్ వల్గారిస్ 30 పొటెన్సీలో రోజూ మధ్యాహ్నం ఒక డోసు మూడురోజులపాటు వాడి ఒక వారం గ్యాప్ ఇచ్చి అదే విధంగా వాడగలరు. నొప్పి ఎక్కువగా ఉన్నట్లయితే నొప్పిని బట్టి బెల్లడోనా 1 ఎం. పొటెన్సీలో అప్పుడప్పుడు వేసుకోవచ్చు.

మీ సాధారణ ఆరోగ్య సమస్యలకు హోమియో చికిత్సా విధానంలో సలహాల కోసం రాయండి:

మా చిరునామా: హోమియో కౌన్సెలింగ్,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి తెలుగు దినపత్రిక, 6-2-249 / 1, సాక్షి టవర్స్,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్, హైదరాబాద్-500 034.
ఇ-మెయిల్: health@sakshi.com